క్లుప్తంగా

వై.రామవరంలో భారీ వర్షం



వై.రామవరంలో కురుస్తున్న వర్షం

వై.రామవరం: మండలంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులు తోకూడిన భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఆకాశం మేఘాలతో నిండి, సుమారు రెండు గంటలపాటు భారీ వర్షం కురవడంతో రహదారులు జలమయమయ్యాయి.

రోడ్డు పనులకు సర్వే



గ్రావెల్ రోడ్డు నిర్మాణంపై గ్రామస్తులతో చర్చిస్తున్న ప్రజాప్రతినిధులు

వై.రామవరం: మండలంలోని చామగడ్డ సచివాలయం పరిధిలోని రాములకొండ గ్రామానికి రూ.5 లక్షల నిధులతో గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి గురువారం సర్వే నిర్వహించి, ప్రతిపాదనలు పంపించారు. ఈరోడ్డు నిర్మాణంపై ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామస్తులతో చర్చించారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని వారు పేర్కొన్నారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ జర్త కృష్ణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ కరణం కనకరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంటు శ్రీనివాసుదొర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సత్యవతి

రాజవొమ్మంగి: మండలంలోని లబ్బర్తి పంచాయతీ సీతారాంపురంలో నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డును సర్పంచ్ మిరియాల సత్యవతి తదితర ప్రజాప్రతినిధులు గురువారం ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా రూ.20లక్షలతో పంచాయతీలోని ఐదు గ్రామాలకు ఐదు సీసీ రోడ్లు మంజూరైనట్టు సర్పంచ్ సత్యవతి తెలిపారు. ఇప్పటి వరకు మూడు సీసీ రోడ్ల నిర్మాణం పూర్తికాగా, మిగిలిన రోడ్ పనులు కూడా వడివడిగా జరుగుతున్నట్లు తెలిపారు. పంచాయతీ వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం



దివంగత యూటీఎఫ్ నేతల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న కార్యవర్గ సభ్యులు

రాజవొమ్మంగి: మండల యూటీఎఫ్ కార్యవర్గ ఎన్నికలు రాజవొమ్మంగి విద్యా వనరుల కేంద్రం వద్ద జరిగాయి. ఆ వివరాలను యూటీఎఫ్ (ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) జిల్లా అధ్యక్షుడు వై.విల్సన్, పరిశీలకులు కోసు కృష్ణ గురువారం విలేకరులకు వెల్లడించారు.

మండల అధ్యక్షుడిగా దాసరి పైడిమల్లు, గౌరవాధ్యక్షుడిగా మిరియాల సత్యవతి, ప్రధాన కార్యదర్శిగా పి.రమణ, అసోసియేట్ అధ్యక్షుడుగా బీరబోయిన సుబ్బారావు, టీవీవీఎల్. ప్రసన్న, కోశాధికారిగా కానెం శ్రీను, కమిటీ సభ్యులు ఎన్నికైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, వెంకటస్వామి, రామిరెడ్డి, సూర్యనారాయణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. కె.కృష్ణ, అద్రయ్య తదితరులు హాజరయ్యారు.

గుండెపోటుతో రైతు మృతి



హరినాథ్‌బాబు (ఫైల్)

ఎటపాక: మండలంలోని తోటపల్లి గ్రామంలో ఓ రైతు గుండెపోటుతో మృతి చెందారు. గ్రామానికి చెందిన ఎల్లంకి హరినాథ్ బాబు గురువారం తెల్లవారుజామున ఇంట్లో పనులు చేసుకుంటుండగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపడిపోయారని కుటుంబసభ్యులు తెలిపారు. స్థానిక రైతులకు అండగా ఉంటూ వారి సమస్యలపై ఉన్నతాధికారులతో మాట్లాడుతుండేవారని పలువురు గుర్తు చేసుకున్నారు. ఆయన మృతదేహానికి పలువురు నివాళులర్పించారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం



గడుగుపల్లిలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం



టోకూరులోని వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎంపీపీ నీలవేణి తదితరులు



గేదలబందలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ బాక ఈశ్వరి. జెడ్పీటీసీ జానకమ్మ, నేతలు

హుకుంపేట: గిరిజనులు పండించే ఆకుకూరలు, వరితో పాటు సాములు, చోళ్లు, కొర్రలు తదితర స్వచ్ఛమైన ఆహారా పదార్థాలు తీసుకుని మంచి ఆరోగ్య వంతులుగా ఉండాలని ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీస సభ్యుడు రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని గడుగుపల్లిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. రోగుల ఆరోగ్య సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. వైద్యాధికారుల సేవలను అభినందించి పూలమాలతో వైద్యులు, సిబ్బందిని సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఎంపీడీవో వెంకటరావు, సీడీపీవో బాలచంద్రమణి దేవి, వైద్యాధికారి డాక్టర్ గాయత్రి, గాయాత్రి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పి.సింహాచలం, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు,

జిల్లా కల్చరల్ విభాగ అధ్యక్షుడు దిలీప్, జేసీయస్ మండల ఇన్‌చార్జి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మెన్ కొండలరావు, సర్పంచ్ సోమేలి సత్యవతి, ఎంపీటీసీ సభ్యులు కిలగాడ సింహాచలం, కొర్ర నాగరాజు, నాయకులు జయరామ్ ,లక్ష్మయ్య,సోమేలి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని టోకూరు పంచాయతీలోని గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే వైద్య సేవలందించడం చరిత్రాత్మకమన్నారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, సర్పంచ్ మోస్య, కో-ఆప్షన్ సభ్యుడు మదీనా, హెచ్‌ఎం స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.



బూసిపుట్టులో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ: మండలంలోని తూటంగి పంచాయతీ గేదలబంద గ్రామంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 421 మందికి వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, ఎంపీటీసీ రామారావు, వైస్ ఎంపీపీ లలిత, నాయకులు లీలరాణి, వైద్యులు ప్రేమ, రాంబాబు, విజయ్, సిబ్బంది ప్రభాకర్, స్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని బూసిపుట్టు పంచాయతీ కేంద్రంలో గురువారం వైద్య సిబ్బంది జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 406 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు, రోగులకు భోజన సదుపాయం కల్పించారు. సర్పంచ్ రాజమ్మ, ఎంపీటీసీ రాములమ్మ, వైద్యాధికారులు నవీన్, నవిత, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజానికి కృషి



మాట్లాడుతున్న ఏఎస్ఓ సూర్యమోహన్‌రావు

మోతుగూడెం: విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా ఈరోజు ఏపీ జెన్కో సెక్యూరిటీ ఆఫీసర్ సూర్య మోహన్‌రావు ఆధ్వర్యంలో మోతుగూడెం జెడ్పీహెచ్ఎస్ స్కూల్, డొంకరాయి ఆశ్రమ పాఠశాలలో అవినీతి చేయకూడదని ఆయన పిల్లలకు అవగాహన కల్పించారు.అవినీతి రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలన్నారు. పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, సెక్యూరిటి సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన



కుమ్మరిపుట్టులో గ్రామస్తులతో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్

ముంచంగిపుట్టు: ఎన్నడు లేని విధంగా ఇంటి వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మండల పార్టీ అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ అన్నారు. సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేతలు పర్యటించారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల అమలుతీరును స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న చొరవతో మన్యంలో సంక్షేమ పథకాలు,అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, ఏ ప్రభుత్వం చేయలేని పని కేవలం జగనన్న ప్రభుత్వ హయంలోనే జరుగుతున్నాయన్నారు. సంక్షమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని కుమ్మరిపుట్టు గ్రామస్తులు నేతలు ఎదుట హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ వెంగడ రమేష్, నేతలు కృష్ణ, గురుమూర్తి, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పెనికిలపాడులో గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

రంపచోడవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏజెన్సీ అన్ని రకాలుగా అభివృద్ధి జరిగిందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు అన్నారు. మండలంలోని భీరంపల్లి సచివాలయం పరిధిలో భీరంపల్లి, పెనికలపాడు గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 328 గడపలను వారు సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పాలన అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు తెలియజేశారు. పార్టీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భజన పోటీలు ప్రారంభం

జి.మాడుగుల: మండలంలో గాంధీనగరం గ్రామంలో హనుమాన్ ఆశ్రమం, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ సన్నిధిలో గురువారం ఘనంగా జిల్లాస్థాయి భక్తి గీతాల భజన పోటీలను విశాఖపట్న భీమిలి సద్గురు సేవాశ్రమం, శ్రీ హనుమ సేవాశ్రమం ప్రతినిధి సాయిరాం స్వామిజీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హైందవ ధర్మ పరిరక్షణ, భజన సాంప్రదాయ సంరక్షణ భజన సంఘాలను, భజన కళాకారులను ప్రోత్సహించటానికి జిల్లా స్థాయి భజన పోటీలను నిర్వహిస్తున్నట్టు ఆయన అన్నారు. జిల్లా భజన పోటీల విజేతలకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా షీల్డులు, నగదు బహుమతులు, ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని ఆయన చెప్పారు. కలెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్ చిరంజీవి, తహసీల్దార్ కె.అప్పలస్వామి, సీఐ సత్యనారాయణ, సర్పంచ్ కిముడు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయిరాం స్వామిజీ

సీపీఎం మహాసభపై ప్రచారం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు తదితరులు

అరకులోయ టౌన్: మండల కేంద్రంలో సీపీఎం నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. విజయవాడలో ఈనెల 15న జరగనున్న ప్రజారణభేరీ యాత్రపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజల హక్కులు, చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమైందన్నారు. నేతలు అప్పలనర్స, కిల్లో సురేంద్ర, అనంతగిరి జెడ్పీటిసీ గంగరాజు, సూర్యనారాయణ, హైమావతి, చినబాబు, రామారావు, గిరిజనులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు/డుంబ్రిగుడ: ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ మండల కేంద్రాల్లో జరిగిన సభల్లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ యోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. గిరిజనుల హక్కులు, చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అడ్డుకోవాలన్నారు. విజయవాడలో నిర్వహించనున్న ప్రజారక్షణ భేరి కార్యక్రమానికి అందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పీఏసీఎస్ రుణాలు

కొయ్యూరు: పీఏసీఎస్‌లో సభ్యత్వాలు నమోదుకు రైతులు ముందుకు రావాలని చైర్మన్ సుమర్ల సూరిబాబు కోరారు. గురువారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లక్ష రూపాయల లోపు రుణాలకు వడ్డీ ఉండనట్టుగా డీసీసీబీ నిర్ణయించిందన్నారు. రైతులు భూమి ఆధారంగా రూ.మూడు లక్షల వరకు రుణ సదుపాయం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతీ పంచాయతీలోను విధిగా రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి పీఏసీఎస్ ద్వారా ఇస్తున్న రుణాలపై అవగాహన కల్పిస్తామన్నారు. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లిస్తే వారికి ఎక్కువగా రుణ పరపతి ఉంటుందన్నారు. నర్సీపట్నం కో-ఆపరేటివ్ బ్రాంచ్ మేనేజర్ నాయుడు మాట్లాడుతూ రైతులకు రుణాలతో పాటు ప్రైవేటు వ్యాపారులకు పరిమిత సంఖ్యలో రుణాలు ఇచ్చేందుకు చూస్తున్నామన్నారు. సీఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన

జి.మాడుగుల: మండలంలోని సొలభం పంచాయతీలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.బి.ఎస్. నందు గురువారం పర్యటించారు. గ్రామంలో పండిస్తున్న చిరుధాన్యాల పంటలను పరిశీలించారు. రైతులు చిరుధాన్యాల పంట సాగుపై దృష్టి సారిస్తే ఆర్థిక లాభాలు పొందవచ్చన్నారు. మార్కెట్‌లో మిల్లెట్స్‌కు మంచి గిరాకీ ఉందన్నారు. పంటకోత ప్రయోగాలు, చిరుధాన్యాల సాగుపై పలు సూచనలు, సలహాలిచ్చారు. వ్యవసాయ పథకాల విధానాలు కార్యక్రమాల ప్రణాళిక కోసం సీసీఈ నుంచి డేటాలను ప్రభుత్వాలు ఉపయోగిస్తాయని, ఇది బీమా కంపెనీలు, ఆర్థిక సంస్థలకు రుణాలు, బీమా నష్టాన్ని అందించే ముందే వారికి అవసరమైన అన్ని ఇన్‌పుట్స్‌ను అందించటానికి ఉపయోగపడుతుందన్నారు. డీపీఎం భాస్కరరావు, ఏవో టెక్నికల్ సూర్యప్రకాష్, ఏవో ఎల్.ఆర్.బి.పాత్రుడు, ఎస్‌ఎఫ్‌ఏ రమణి, ఎన్‌జీవో వాసన్, వీఏఎలు, ఎంపీఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.



సొలభం పంచాయతీలో సామ పంటను పరిశీస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నందు

విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

తుమ్మపాల: భారత ప్రభుత్వ సంస్థ (మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) సంస్థతో విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ కోసం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఒప్పందంపై సీఎస్‌సీ అకాడమీ ప్రతినిధులు సంతకాలు చేశారన్నారు. ఈ ఒప్పందం ద్వారా యుజీ, పీజీ చేస్తున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో పాటు అన్ని వర్గాల విద్యార్థులకు నైపుణ్య శిక్షణపై అవగాహన జరుగుతుందన్నారు. చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ అలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, తమ డిగ్రీతో పాటు అదనపు సాంకేతిక పరిజ్ఞానం చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌సీ అకాడమీ ప్రతినిధులు రామ్మోహన్‌రావు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఒప్పందం చేసుకుంటున్న డైట్ కళాశాల

ఆలయ మండపం ప్రారంభం

రంపచోడవరం: రంపచోడవరం సమీపంలోని సీతపల్లి బాపనమ్మ ఆలయం వద్ద నిర్మించిన మండపాన్ని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిలు, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు) గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు ఆలయ ఈఓ సత్యరమేష్ ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ఆలయ ప్రాంగణంలో స్వయంభూగా వెలసిన అమ్మవారికి గుంటూరుకు చెందిన భక్తుడు సత్యనారాయణమూర్తి మండపాన్ని నిర్మించారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.కొత్తగా నిర్మించిన మండపంలో ఆలయ పూజారి రామకోటేశ్వరరావు పూజలు నిర్వహించారు. ఎంపీపీలు బందం శ్రీదేవి, కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, అన్నవరం డైరెక్టర్ కారుకోడి పూజ, సొసైటీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొర,వైస్ఎంపీపీ గారపాటి మురళీ, సచివాలయ కన్వీనర్‌లు పండా రామకృష్ణదొర, కందుల బాబ్జి, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, వంశీ కుంజం, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

పాఠశాల ఆకస్మిక తనిఖీ



ముడ్వంవలసలోని విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: మండలంలోని కొండిబ పంచాయతీ ముడ్వంవలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంపీపీ శెట్టినీలవేణి గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులు సామర్థ్యాన్ని పరిశీలించి సంతృప్తి చెందారు. ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యాకానుక కిట్లు, అమ్మఒడి తదితర వాటిని సద్వినియోగం చేసుకుని, విద్యార్థులు బాగా చదివి ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. మధ్యాహ్నం భోజనాన్ని రుచిచూచి సంతృప్తి వ్యక్తం చేశారు. కో-ఆప్షన్ సభ్యుడు మదీనా, పాఠశాల ఉపాధ్యాయుడు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి

హుకుంపేట: జిల్లా వినియోగదారుల సంఘం ఎన్నికలు స్థానిక సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. జిల్లా సంఘం గౌరవ అధ్యక్షుడు బైరాగిమూర్తి అధ్యక్షతన ఎన్నిక ఏకగ్రీవంగా నిర్వహించారు. జిల్లా వినియోగదారుల నూతన సంఘం అధ్యక్షురాలిగా పరమేశ్వరి, ఉపాధ్యక్షుడిగా రఘునాథ్, కార్యదర్శిగా సంగీత, శివ ప్రసాద్, రామస్వామి, కోశాధికారిగా ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. పాడేరు, అరుకు నియోజకవర్గాల డివిజన్ సెక్రటరీలుగా హరి, సంతోష్, సత్యనారాయణ, ఎస్.సంతోష్, రంపచోడవరం డివిజన్ సెక్రెటరిగా ఆర్.నగేష్, పి.వి.భాస్కర్ రెడ్డి, నాగమణి, సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

విద్యార్థులకు మెరుగైన బోధన

అరకులోయటౌన్: రవ్వలగుడ, కంఠబౌంషుగుడ గిరిజన సంక్షేమ ఉన్నత బాలుర పాఠశాలలతో పాటు కొత్తభల్లుగుడ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం ఏటిఎల్, జనరల్ ల్యాబ్‌లను టాస్క్ ఫోర్స్ ఆఫీసర్ ఆర్.వి.రమణ పరిశీలించారు. రమణ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు. ల్యాబ్‌లో ప్రాక్టికల్స్ తప్పనిసరిగా జరిపించాలన్నారు. హెచ్‌ఎంలు కెందు, దయానిధి,పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



ల్యాబ్‌ను తనిఖీ చేస్తున్న అధికారి రమణ

వైభవంగా మరిడిమాంబ జాతర

అనకాపల్లి రూరల్: రెండు గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం మండలంలోని కొత్తూరు, పిసినికాడ గ్రామాల్లో అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పిండి వంటలతో అమ్మవారికి నైవేద్యం పెట్టారు. సాయంత్రం గ్రామాల్లో పలుచోట్ల ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బాజాభజంత్రీలు,డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేయడానికి గ్రామస్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. అమ్మవారికి పసుపు కుంకుమలు,చీరలు, గాజులు, నల్లపూసలు సమర్పించారు. విద్యుద్దీపాలంకరణతో జాతరలో సంది నెలకొంది.

భక్తిశ్రద్ధలతో రుద్ర హోమం

మాకవరపాలెం: స్థానిక వామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం నుంచి ఆలయంలో రుద్ర హోమం , లక్ష్మీగణపతి హోమం, మృత్యుంజయ హోమంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొని ప్రసాదం స్వీకరించారు.

వరిలో తెగుళ్లపై అప్రమత్తం



వరి పంటను పరిశీలిస్తున్న ఏవో వాసుదేవరావు

మాడుగుల రూరల్: వరి పంటకు సోకే తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవో ఎం. వాసుదేవరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన పలు గ్రామాల్లో వరి పంటను పరిశీలించారు. ప్రస్తుతం వరి పంటకు పాచితెగులు(పాము పొడ తెగులు), ఆకు ముడత తెగులు సోకాయని, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. మండల వ్యవసాయ విస్తరణాధికారులు సత్యనారాయణ, జగన్నాథం, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు గోవాడ విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

చోడవరం రూరల్: మండలంలోని గోవాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల యలమంచిలి మండలం వి.కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి విశాఖ జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో అండర్ -17 విభాగంలో గంగా కుసుమదీప్తి, అండర్ - 14 విభాగంలో చిరికి వసంత ఎంపికయ్యారు. వీరు పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు కె.రాము గురువారం తెలిపారు. ఆయనతోపాటు ఫిజికల్ డైరెక్టర్ జి.ఉదయభాస్కర్, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.